# కొత్త రచయితలు

## లవ్ స్టోరి

### వలపు విరహం

అందమైన 'నా' గులాబి (బేబీ)కి

'నా' హృదయ వందనం!

నా లేఖ అంది వుంటుందని భావిస్తున్నాను. కోపంతోనే రిప్లై ఇవ్వలేదని కూడా ఊహించాను. సారీ మై డియర్ బేబీ. నిజంగా ఆడవాళ్ళంటేనే ఇంతేనేమోనోయ్. వారి మాటలకు అర్థాలే వేరునని అక్కడికీ చెప్పనే చెప్పాడో మహానుభావుడు. లేకపోతే ఏమిటోయ్! లేఖ వ్రాసే దాకా నా ప్రాణం తీసావు. ఏమిటేమిటో వ్రాశావు. తీరా వ్రాసాక రిప్లై వుండదు.

ఇప్పుడెలా వుంది ఒళ్ళు? సారీ! ఆరోగ్యం. నిద్ర పట్టడం లేదంటూ ఆ మధ్య కంప్లైంటు చేశావు కదా. చిరంజీవిని మర్చిపోయి నన్ను తలచుకుంటూ నిద్రపో. సిగ్గేస్తుందా? తప్పదు పత్నీజీ! (కాబోయే) నీ పొడవైన కురుల మధ్య వ్రేళ్ళు పోనిచ్చి నీ అధరాల నందుకోవడానికి ఎత్తైన ఎదపై వాలిన స్మృతి ఇంత చలిలోనూ వేడి పుట్టిస్తోంది డాళింగ్. మళ్ళీ నిన్ను చేరుకొని బరువైన నీ గుండెల చాటున మాటు వేయాలని నా మనస్సు గోల పెడుతోంది. ఏం చేయను చెప్పు? ఎంత అదుపు చేసుకోవాలనుకున్నా నీ ఊహలు, తలపులే నా ప్రాణం తీస్తున్నాయి. ఈ చలిని భరించలేక...అరె నిజం...నిజంగా...సారీ డియర్ నీ ముందు నిజం దాగలేక పోయింది. ఈ చలిని తట్టుకోలేక నిన్న ఒకర్ని ఎంగేజ్ చేశాను. పెద్ద మనసుతో అర్థం చేసుకుంటావని చెప్పాను. అరె! ఏమిటీ ఏదో ఏడుపు విన్పిస్తోంది. సారీ డాళింగ్. మరీ ఇంత సెంటి'మెంట'లిస్ట్వై పోతే ఎలా? ఎమ్మెస్సీ చేసావే ఆ మాత్రం నా పరిస్థితిని ('రీసెర్చ్' చేయలేక పోయినా కనీసం) అండర్ స్టాండ్ చేస్కోవచ్చు కదా. ఇంతలోనే "నిన్ను విడిచి వెళ్ళాలనీ, అన్నీ మరిచి పోవాలనీ" అని నేన్నట్లుగా బాధపడి పోతున్నట్లున్నావ్! అసలు విషయం మర్చే పోయాను. నిన్న ఆవిడ దగ్గరకు వెళ్ళానన్న మాటేగానీ నిన్ను చూసిన కళ్ళతో ఆమెను చూడలేక పోయాను. (నిజం! డియర్) ఆమె నన్నో వెధవను చూసినట్లు చూసి జేబుకొట్టేసి వెళ్ళిపోయింది చీర చుట్టుకుని. చుట్టుకోవడం అంటే గుర్తొచ్చింది. చీర కట్టుకోవడం కూడా ఓ కళేనని నిన్ను చూశాకే తెల్సింది. ఆ కట్టూ, కుచ్చిళ్ళ దగ్గర ఒంపులు తిరిగిన నీ నడుమూ, ఓహ్! రియల్లీ ఫెంటాస్టిక్! కళ్ళు ప్రక్కకు తిరిగేవి కాదనుకో నీ నడుము పైనుండి. ఛ...ఈ మాట నిన్ను అవమానించినట్లుగానే వుంది. ఒక్క నడుమేమిటి అసలు నీ రూపే నన్ను కదలనిచ్చేది కాదు. నీ ఒడిలో తల వాల్చినపుడు నా పెదవులతో ఆడుకుంటూ నన్ను ఈ ఉద్యోగానికి వెళ్ళమని నీవు చెప్పబట్టే రాగలిగాను. అయినా నీవెలా చెప్పావు, నన్నింత దూరం వెళ్ళమని. వెధవ ఉద్యోగం లేకపోతే పోయే. నిన్ను వదిలివచ్చి వుండాలంటే నా వల్ల కావడం లేదు కరిష్మా. మీ ఇంట్లో అందరూ గుడికి వెళ్ళారని ధైర్యం చేసి మీ ఇంటికి వచ్చాను. గుర్తుందా. హాయిగా నా గుండెలపై వాలి కబుర్లు చెప్తున్నపుడు వచ్చి గందరగోళం చేసాడే వెధవ (మీ తమ్ముడు)-ఏం చేస్తున్నాడు. ఒక రకంగా వాడికి మనం ఋణపడి వున్నామనుకుంటా. ఎందుకంటే వాడివల్లే కదా మన ప్రణయం బయటపడింది. అప్పట్లో ఓ నిరుద్యోగి భడవాయిని కనుక మీ ఇంట్లో వాళ్ళు నన్నో అస్పృశ్యుడ్ని చూసినట్లు చూశారు. నాపట్ల అప్పుడు నీవు చూపిన అభిమానం, ప్రేమ, నువ్వు చేసిన ధైర్యం, నిజంగా నేను చాలా అదృష్టవంతుడ్ని కరిష్మా. యూనివర్శిటీ లైబ్రరీలో జరిగిన తమాషా సంఘటన మన ప్రేమ డైరీలో విమాత్న పేజీ. ఎవరూ లేరనుకొని మాట్లాడుతూనే ( పుస్తకాల రాక్ వెనుక) అకస్మాత్తుగా నిన్ను ప్చ్...ప్చ్...ఆ తొలి ముద్దు...టిక్...టిక్... టిక్... శబ్దం...ఒక్కసారిగా గుండెల్లో రైళ్ళు పరుగెట్టాయి. ఆ తుంటరి పనిచేసింది మృణాళినే కదూ ( అది నీ సలహాపైనేనని తర్వాత తెల్సిందిలే ప్రియతమా!) ఎంత పని చేయించావ్. నిజంగా నీ డేరింగ్‌నెస్‌ను అప్రీషియేట్ చేయకుండా వుండలేక పోతున్నానోయ్. అయినా నేను ముద్దు పెట్టుకుంటానని ముందే ఎలా ఊహించావ్?! నిజంగా ఆ దృశ్యం స్వర్ణ చిత్రం. ఏయ్! కరీ(ష్మా) వింటున్నావా! లేదా? అసలు గుర్తున్నానో లేదో! ఏవండీ మేడమ్ గారు, మీరు అధ్యపకురాలు కదా అంత త్వరగా మర్చిపోతారని అనుకోను. అందునా ఇన్ని రాచకార్యాలు నడిపిన వాడ్ని ఎలా మర్చిపోగలవులే! ఏవంటున్నారు మీ ఓల్డ్ ప్రొఫెసర్ ఫెరోస్? ఎవరికోసం సుమీ ఈ పడిగాపులు, ఎదురుచూపులు అన్లే. మొన్నా మధ్య ఏదో లెటర్‌లో 'ప్రొఫెసర్ కిషోర్‌ని లవ్ చేస్తున్నానంటూ అందరూ గోలపెడుతున్నారని వ్రాశావు ఎలా వున్నాడా మహానుభావుడు (పూర్ ఫెలో!) నన్ను వెంటనే వచ్చేయమని గోలపెట్టావు. ఆ మాట నన్ను నిజంగా బాధపెట్టింది డియర్. నా కాలయాపనతో నిన్ను ఇబ్బంది పెడ్తున్నానేమో ననిపించింది అందుకే వచ్చేస్తున్నాలే. ఈ మాట ఇప్పటికి ఎన్నిసార్లు చెప్పానో అని లెక్కపెడుతున్నావా సారీ మేమ్! ఎప్పటికప్పుడు రావాలనే అనుకు




రచయిత చిరునామా:

ఎం.ఎస్. సందాని

2వ అంతస్తు

బ్రాడీపేట 4వ లైను,

గుంటూరు – 522 002

టున్నాను. ఏది లింభస్తేనా? తీర ప్రాంతంలో ఉద్యోగం. అందులో కమాండర్ పొజిషన్‌లో వుండటంవల్ల ప్రతీరోజూ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయంటూ శెలవులకు కత్తెర వేస్తుంది ప్రభుత్వం. మనల్ని ఎక్కువ రోజులు విడదీసి వుంచిన పాపానికేనేమో మొన్నొక ప్రభుత్వం పడిపోయింది. ఇంకా పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ ప్రభుత్వమూ అంతే. మన ఉసురు తగిలి చస్తున్నాయి. తప్పదు. ప్రక్క దేశంలో కూడా కొత్త ప్రభుత్వం వచ్చింది కదా, పరిస్థితి మెరుగైతే శెలవు దొరుకుతుందిలే. ఇదిగో చెప్తున్నా కరీ...మరో నెల రోజుల్లో నాకు శెలవు మంజూరు చేయకపోతే ఈ ఉద్యోగానికి 'గుడ్ బై' చెప్పి వచ్చేస్తా. ఆ తర్వాత నీ యిష్టం. నువ్వే పోషించాలి నన్నూ, నా పిల్లల్నీ. (సారీ! మన పిల్లల్ని—అదీ మన

పెళ్ళయ్యాకేలే. అపార్థం చేసుకోకు) ఏమిటి కరీ! నేనేమన్నా బోర్ కొట్టేస్తున్నానా? డాబాపై నేవీబ్లూ కలర్ చీరలో తలకు స్నానం చేసిన కురులను సవరించుకుంటూ నా లెటర్ చదువుతుండే స్థితిలో నిన్ను ఊహించుకుంటే ఓహ్! నీ పక్కన వాలిపోవాలనిపిస్తోంది. ఒక్కసారిగా

క్రిందకు దూకేయాలన్నంత ఉద్వేగం కలుగుతోంది. నిజం చెప్పొద్దూ, నీ తలపులతోనే కాలం గడపగలుగుతున్నాను. నీ పరిచయం, ప్రణయం నన్ను జీవితంలో నిలబెట్టాయి. నీతో పరిణయమే ఇక మిగిలింది. కాలం తుపాకీ ఎక్కుపెట్టి నన్ను కదలనివ్వకుండా చేసినా నీ ఒళ్ళో వాలటం ఖాయం. ఎదురుచూస్తుంటావని ఆశిస్తూ నీతో పరిణయం పూర్తయినట్టు కలర్ కలలు కంటూ నీ ఒళ్ళో వాలే శుభోదయం కోసం ఎదురు చూస్తున్నా...ప్రేమతో...

నీ

ప్రణయ్

